# స్మృతి - ప్రత్యభిజ్ఞ

'కార్య కారణ సంబంధాల్లో నాకున్నంత నమ్మకం, మరో కరి కుంటుందని నే ననుకోను. ప్రతిపనికీ, ఏదో ఓ కారణం—అది చిన్నదైనా కావచ్చు; పెద్దదైనా కావచ్చు—విధిగా ఉండితీరాలని విశ్వసించేవాళ్ళల్లో నేనూ వొకణ్ణి కానీ, నాకూ అంతుబట్టని వ్యవహారం, నా జీవితంలోనే, ఒకసారి తటస్థపడ్డది.' అన్నాడు భావనారాయణ మా అందరివేపూ చూచి.

'ఏమి టేమి,టని అడగడం మా విధాయకం కనక అడిగాం.

భావనారాయణ ఓ పొడిదగ్గు దగ్గి, చేతులు రెండూ వెనక్కు చాపి, వాలుగా కూచుంటూ చెప్పసాగాడు:

అప్పుడు రాజమండ్రిలో పని చేస్తున్నాను. అక్కణ్నించి మార్పించుకోవాలని నేనెన్నో ప్రయత్నాలుచేశాను. పట్టవలసినవాళ్ళనందర్నీ పట్టాను. ఏదన్నా ఇంతమేత పారేద్దామని గూడా అనుకొన్నాను. అదేం ఖర్మమో గానీ, నన్ను చూడంగానే అందరూ, బుద్ధిమంతు లయిపోతుండేవారు. కొసకు తేలిందేమిటంటే, నా రోదనం, అరణ్యరోదనం అయింది.

అసలే నాకు రాజమండ్రంటే చెప్పరాని అసహ్యం. వీథులన్నీ మురికితో లసలసలాడుతుంటాయి. పట్టుమని ఫర్లాంగుదూరం, ఏ బజారూ తిన్నగా ఉండదు. పాము మెలి

కలకు మల్లే, వీథులన్నీ వంకర్లు తిరిగి ఉంటాయి. దీనికితోడు మిట్ట పల్లాలు. బహుశా, నా అసహ్యానికి ఇవే కారణమేమో నేను చెప్పలేను.

దీనికితోడు, నా పై ఆఫీసరు పరమ కర్కోటకుడు. పైగా నేను ట్రాన్స్‌ఫర్ కోసం చేసిన ప్రయత్నాలన్నీ నీళ్లు గారిపోవడం; ఇవన్నీ కలిసి నాలో ఉన్న అసహ్యాన్ని తెగ రెచ్చగొట్టాయి.

అందుకే సాధ్యమైనంతవరకూ, మనుషుల్ని తప్పు కొంటూ ఉండేవాణ్ణి. ప్రాణం ఉగ్గబట్టి అయిదుగంటలదాకా, ఏదోవిధంగా, ఆఫీసులో కూచుని, సాయంత్రం అల్లా, సారం గథరుడి మెట్టకేసి నడిచిపోతుండేవాణ్ని.

చల్లని గోదావరిమీదిగాలి, వెదురు తట్టులు నెడుతూ, గోదావరి యాసతో, పల్లెవాళ్ళు పాడే పాటలూ, దూరంగా, ఒత్తుగా పచ్చగా పెరిగిన చెట్లసోలుపు, ప్రాణానికి కాస్తంత తెరిపిని ఇస్తుండేవి. పగలల్లా ఎంతగా అసహ్యించుకొంటేనేం గాక, ఆ సాయంత్రాలు, ఏవో కనిపించని పాశాలతో, నన్ను రాజమండ్రికి కట్టిపడేసి ఉంచేవి.

...మనలో చాలామందికి చరిత్రను, ఏదో చదివినట్లు చదివి పారేయడం అలవాటనుకుంటాను. నాకా పద్ధతి, బొత్తిగా సరిపడదు. ఒక్కో చరిత్రను చదువుతున్నప్పుడు, ఆనాటి వాతావరణమంతా, మనస్సులో మెదిలి, ఏదో చెప్పరాని ఆవేశానికి నేను గురవుతుంటాను. శాస్త్రకారులు, దీన్ని నరాల బలహీనత్వం అంటున్నారు. కావచ్చునేమో గానీ, నేనుమాత్రం, వారితో ఏకీభవించలేను.

సారంగధరుడి మెట్ట ప్రాంతాలకు వెళ్ళినప్పుడల్లా, నే నలాంటి అనుభూతికే లోనవుతుండేవాణ్ని. ఆనాటి తెలుగు ప్రభువులు, వారి ఆంధ్ర భాషాభిమానం, కవిపోషణ, పండిత సదస్సులు, తలంపుకొచ్చి, ఏవో వెర్రి ఆనందాలలో జోగి పోతుండేవాణ్ని. అదో స్వర్ణశకం-తరువాత రెడ్డిప్రభువులు వారి సాహిత్యపోషణ-

వీటితోబాటు, నాకు, చిత్రాంగి, సారంగధరుడు గూడా జ్ఞప్తికొస్తుండేవాళ్ళు. సారంగధరుని, కాళ్ళు చేతులు నరికిన స్థలమంటూ, అక్కడివారు చూపించిన ఓ బండరాయి మీద కూచుని, అలా గోదావరిలోకి చూస్తూ... అదో చిత్ర మైన అనుభవమనుకోండి.

ఎంతటి మహారాజూ, పండితుడూ, కవిపోషకుడూ అయితేనేం గాక—స్త్రీదగ్గరకొచ్చేసరికి, ఆ ప్రభువులోనూ, మృగాలు చెలరేగాయి. ఇతర విషయాల్లో రాజరాజనరేం ద్రుణ్ని, ఎంతగా అభినందించినా, చిత్రాంగిసంఘటన జ్ఞప్తి కొచ్చే సరికి 'ఎంత పాడుపని చేశాడు ?' అనిపించేస్తుంది.

అసలు చిత్రాంగిని కొడుక్కనేగదా, మొదట అను కొన్నది! సగబడ ప్రయత్నాలన్నీ అయాక, దుడుంగున కొడుక్కు అడ్డం వెళ్ళి, ఆ పడుచుదాన్ని తను లాగేసు కొన్నాడు ఆరాజు; అంతమాత్రంచేత, చిత్రాంగి మనస్సు మారుతుందనీ, తనను గాఢంగా ప్రేమించేస్తుందనీ, ఆ పెద్ద మనిషి, ఎందుకనుకొన్నాడో, ఎట్లా అనుకున్నాడో బోధ పడకుండా ఉంది. కేవలం, తాళికట్టడంమీదనే, ఆడదాని

ప్రేమ ఆధారపడిఉంటుందని, అంతటి పండితుడూ అనుకొన్నాడంటే, చాలా ఆశ్చర్యమేమరి!

ఇది నిజం కాదని, చిత్రాంగి రుజువుచేసింది. తన మనస్సు, సారంగధరుడికే అర్పితమైందని, ఆవిడ బైట పెట్టింది. నా అనుమానం, సారంగుడికున్నూ-డా చిత్రాంగిపట్ల ప్రణయం ఏర్పడి ఉండాలి. అయితే తండ్రిని చూచి భయపడిఉండొచ్చు. ఇదే కానిపక్షంలో చిత్రాంగి చాలా పొరబాటుపడ్డ దనాలి. సారంగునిపట్ల ఆమెకున్న ప్రణయాన్ని చూసి, మనం మెచ్చుకోవాలో; లేక, అలాంటి భీరువుకు తన ప్రణయాన్నర్పించిన ఆమె తెలివిహీనతకు జాలిపడాలో తెలియదు. ఏది ఏమైనా కానివ్వండి, రాజరాజ నరేంద్రుడు చేసిన పని మాత్రం, నా మట్టుకు నేను సహించలేనిది. ఒక స్త్రీ ప్రణయహృదయాన్ని అర్థంచేసుకోలేనివాడు, ఎవడైతేనేం—నా దృష్టిలో పరమ జడుడు!

ఆ ప్రాంతాలలో కూచున్నప్పుడు, నాకివే ఆలోచనలు వచ్చేవి. ఇప్పటికీ, ఆ శిథిలరాసులనుంచి, చిత్రాంగి గొంతెత్తి- తన సారంగధరుణ్ని పిలుస్తున్నట్టుగానే నాకు స్ఫురిస్తుండేది. అతనికోసం, ఆమె ఉపవనంలో వెదుకుతున్నట్టూ, అతగాడు ఎదురుచూపులు చూస్తున్నట్టూ, నాకు అనిపించేది...

సరే—

అసలు సంగతి కొస్తున్నాను. ఇలా, రోజులు, వారాలు గడిచిపోతున్నాయి. క్రమక్రమంగా, నేనూ, ఆ పరిసరాలకు అలవాటుపడిపోయాను. ఏదో బద్ధకించి, ఒకరోజు

పోకపోయానో, మరింకేమీ తోచేదికాదు. ప్రాణం గోదావరి గాలికోసం విలవిలలాడిపోయేది.

ఒకసారి—ఇలాగే పొద్దుపోయిందాకా కూచున్నాను. ఎంతకీ కదలబుద్ధికాలేదు. యౌవనాన్ని చిగిరింపజేసే గోదావరిమీది గాలి, ఆకాశాన అర్ధచంద్రుడు, చుట్టూ భావురుమంటున్న పురాతన శిథిలావశేషాలు, మసక మసగ్గా కనిపించే బ్రిడ్జి, నీటిమీంచి తేలివచ్చే, పల్లెకారుల పాట—అలానే ఉండిపోయాను.

నావెనక ఏదో చప్పుడయింది. తిరిగి చూశాను. ఓ ఆకారం, అల్లంతదూరంలో కదులుతోంది. ఎవరోనని సరిపెట్టుకోందా మనుకొన్నాను. కానీ మనసు—సమాధాన పడిందికాదు. అటే కళ్ళప్పగించి చూస్తున్నాను. నేనక్క-డున్నట్టు ఆమె గమనించినట్టులేదు. లేకపోతే, అంత దగ్గరగా వచ్చిఉండేదికాదు మరి!

ఉన్నట్టుండి ఆ ప్రదేశమంతటా, కళ్ళు చిల్లులుపడే కాంతిపుంజాలు ఉవ్వెత్తుగా విచ్చులుకొన్నాయి. ఏవో కమనీయమైన ధ్వనులు, దేవవాయువులతో కలిసి నన్ను అలుముకొన్నాయి. అనిర్వచనీయమూ, అపూర్వమూ అయిన, ఆనందోద్రేకాలు, నన్ను వివశుణ్ణి చేశాయి... చివరిసారిగా, కనులు విప్పి చూశాను. ఓ అప్సరాంగన, చిరునవ్వుతో, నా మీదికి వంగి కళ్ళల్లోకి చూస్తో...

చాలాసేపటికిగానీ, తిరిగి కోలుకోలేదు. ఎంత ఆశ్చర్యపోయిఉంటానో, ఇప్పుడు చెప్పలేను. ఆ మేడలు...

ఆ వీథులు... ఆ మనుషులే వేరు. ఆ స్త్రీలు—అదో రాచ నగరులా ఉంది.

ఓ పెద్ద తోట. మెల్లిగా దానిలోకి అడుగుపెట్టాను, ఆ చెట్లు, పొదరిళ్ళు పూలు, పెద్ద కొలను, చుట్టూ, సుఖంగా కూచునేందుకు ఆసనాలు, తేనెపట్టులు, సువాసనలు, దూరంగా ఎవరో వీణవాయిస్తున్న కమనీయ ధ్వని...

ఏమీ తోచక, ఓ పొదరింటిలో కూచున్నాను. దూరంనుంచి, తడబడుతూ వొచ్చిన అడుగుల చప్పుడు, పొదరింటిదాపుకొచ్చి, ఆగిపోయింది, వో క్షణం. తరవాత లతలు కదలిన చప్పుడు: ఓ మెత్తని పచ్చని చెయ్యి, నన్ను రమ్మన్నట్టుగా సైగచేసింది. ఎవ్వరో తెలీదు. పోవద్దనుకోవడం సాధ్యమా? లేచాను. తలమీద రాలిన పూరజాన్ని దులుపుకొంటో, వెలికివచ్చాను. ఓ క్షణం నాకేసి చూసి, చప్పున కౌగిలించుకొని, భుజంమీద తల ఆన్చింది.

'భద్రా!' అంటూ గొణిగింది.

'ఊఁ' అన్నాను అప్రయత్నంగా.

'వచ్చావా? వచ్చావా?' అన్నది.

'నాకు తెలుసు నువ్వొస్తావు, నాకోసం ఏమైనా చేస్తావు. నాకోసం ప్రాణమైనా ఇస్తావు.' అన్నది, నన్ను తన మీదికి జార్చుకొంటూ.

'అవును. నీకోసం వచ్చాను. నీకోసం చచ్చిపోతాను. నీకోసం ఏదన్నా చేస్తాను. నీకోసం...'

చప్పున పెదాలతో నా నోరు నొక్కి 'చాలు' అన్న దాఘ.

మంజీర నేను, ఆ తోటంతా కలయ దిరిగాము. చాలాచోట్ల ఆగి, అందంతో వంగిపోతున్న పూలను ఒకరి మీద మరొకరం చల్లుకొన్నాము. కాస్సేపు, ఆ కొలనులో నావమీద షికారు...

మంజీరను గురించి, నేనే కవినైతే కావ్యాలకొద్దీ రాసేద్దును. ఏ దేవ సౌందర్యమో, శాపానికి గురికాబడి ఇలా అవతరించిందేమో ననిపించింది. ఈమె—నన్నెవరుగా అనుకొంటున్నదో? 'భద్రా' అని పిలుస్తోంది. నన్ను, తన ప్రియుడు భద్రుడనే అనుకొంటోందేమో ? నేను సరే—ఆ భద్రు డెంత అదృష్టవంతుడో గదా! అంతటి అందాన్ని, ఇంతటి గాఢానురాగంతో సహా, సంపూర్ణంగా తన అనుభవంలోకి తీసుకొన్న అతని పురాజన్మ సుకృత విశేషం గణనీయమైనదే! మంజీర, నన్ను గురించి భ్రమపడుగాక — నాకెంతో ఆనందాన్ని-మహర్షులు తురీయావస్థలో పొందగలిగినదాన్ని, ఈ జన్మలోనే నాకిస్తున్నదంటే, ఈ అమూల్య వరాన్ని చేజేతులా పోగొట్టుకోలేను.

నా ఆలోచన కనుగొన్నదానిలా 'నేను పొరబడలేదు' అన్నది మంజీర, నామీదికి వొరిగి మృణాళనాళాలవంటి బాహువులు మెడకు చుట్టి, చిన్నినోటితో నా ముఖం వెదుకుతూ.

'లేదా ?' అన్నాను. ఆమె గొణిగింది. ఆ మాటలంటున్నప్పుడు ఆమె పెదవులు వణికాయి. ముఖం జేవురించింది. శరీరం రోమాంచితమయింది.

[గంధర్వుల్లో 'వనమాలి' అనే ప్రాంతీయ నాయకు డొకడుండేవాడు. అతని కొక కూతురున్నది. ఆమెపేరు 'శుకవాణి'. వస్తుత: గంధర్వులు సౌందర్యానికి పేరు పొందిన వారు. వారందరిలోకీ శుకవాణి గొప్ప అందగత్తె. అదృష్ట వశాత్తూ ఆమె చాలా చురుకైనది. దానికితోడు చదువు సంధ్యలుగూడా అబ్బినవి. ఈ కారణంగా ఆమెపేరు, ఆబాలగోపాలానికి పరిచయమయింది. ఆమెకు యుక్త వయస్సు వచ్చినప్పుడు—చాలామంది గంధర్వ యువకులు, ఆమెను వివాహమాడాలని ఉవ్విళ్ళూరారు. ఆమె చిరు నవ్వుకోసం కలలుకన్నారు. కానీ ఆమె మనస్సు 'మధూలి'పై లగ్నమయివుంది. ఎందరెన్నివిధాల చెప్పినా ఆమె వినలేదు. మధూలిపట్ల గల గాఢానురాగంతో, ఆమె ఇంద్రసభకు గూడా వెళ్ళడం మానేసింది. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని, ఇంద్రుడు ఆమెనూ, ఆమె ప్రియుణ్ణి, విర హాంతో కుమిలిపోవలసిందిగా . శపించాడు. ఈ శాపవిమో చనం మూడు జన్మలకుగానీ తీరదన్నాడు. ప్రతి జన్మ లోనూ, శుకవాణి యౌవనం నిరుపయోగం అవుతుం దన్నాడు. అయినా శుకవాణి చలించలేదు. మూడు జన్మల తరువాతనైనా సరే, తన 'మధూలి' కోసం, నిరీక్షిస్తూ ఉండగలనని అన్నది.]

'అంతే భద్రా! ఆ జన్మలో వారిద్దరికీ, మరి కలు సుకొనే యోగం లేకపోయింది. అలానే, ఒకరినొకరు తలుచు కొంటూ, కృశించిపోయారు' అన్నది మంజీర.

నేను ఆశ్చర్యపోయాను. నా నోటివెంట ఏమాటా రాలేదు. ఏవో పురాస్మృతులు వెలికి రావాలని ప్రయత్నించి, రాలేక గిజగిజలాడుతున్నట్టుంది.

మంజీర మళ్ళీ ప్రారంభించింది.

[రెండవ జన్మలో ఆమె చిత్రాంగిగా జన్మించింది. మధూలి, సారంగధరుడుగా జన్మించాడు. చిత్రాంగి, మనస్ఫూర్తిగా సారంగునికి భార్య కావాలని వాంఛించింది. అతనికోసం అక్షరాలా కలలు కన్నది. తన సర్వస్వాన్ని అతని పాదాలముందు అర్పణచేసింది. సారంగుడు కూడా, చిత్రాంగికోసం పరవటిల్లాడు. ఆమెతోడి తన భావిజీవితం ఊహించుకొని తన్మయుడయ్యాడు. కానీ, ఫలితం మరోలా పర్యవసించింది. సారంగునికి భార్య కావలసిన చిత్రాంగి, అతనికి తల్లి అయింది. ఇలాంటి పరిణామం కలగడానికి, ఆ రాజ రాజ నరేంద్రుడే కారణం! చిత్రాంగిసౌందర్యం చూచి, వెర్రులెత్తి, అతగాడు ఈ అత్యాచారానికి పాల్పడ్డాడు. అయినా చిత్రాంగి మనస్సు మారలేదు. సారంగధరుడూ మారలేదు. తండ్రిమీద తిరుగుబాటు చేశాడు. చేసిన ఫలితంగా, దారుణమైన శిక్షను అనుభవించ వలసి వచ్చింది. ఇలాటి దేదో జరుగుతుందని, ఆమెకు తెలుసు. ఈ విపత్తును అరికట్టాలని ఆమె చేసిన ప్రయత్నాలన్నీ వీగిపోయాయి. సారంగధరుడు, శిక్షకు గురికాబడిన రోజునే, చిత్రాంగి కూడా ఆత్మహత్య చేసుకొంది. ఈ రెండవ జన్మలో కూడా, శుకవాణికి, ప్రియా సంయోగం లభించ లేదు.]

ఒక్కసారి నిట్టూర్చింది మంజీర. నా గుండెలు గుబులు గుబులు మన్నాయి. శరీరం విద్యుదావేశితమయి నట్లయింది. ఏమీ తోచక, వెర్రిగా కేకపెట్టాను...

మంజీర నన్ను సాశ్రునయనాలతో వీక్షించి, తిరిగి చెప్పనారంభించింది.

[అది జరిగిన కొంతకాలానికి శుకవాణి, మాంచాలగా జన్మించింది. మధూలి, బాలచంద్రుడుగా జన్మించాడు. వారిద్దరికీ వివాహంలాంటి తతంగమేదో జరిగింది. ఐనా వారెప్పుడూ కలుసుకోలేదు. కలుసుకొన్నా, ఒకరినొకరు చూచి గుర్తించగల పరిచయమన్నా లేదు. చాలామంది అనుకొంటున్నట్టు బాలచంద్రుడు, తన వయస్సును 'సాని సబ్బాయి'కి ధారపోయలేదు. అతను, ఆజన్మాంతం, స్త్రీసుఖ మంటే ఏమిటో ఎరుగడు. అతనికి మాంచాలపట్ల అనంతమైన ప్రేమభావం ఉన్నది. మాంచాల గూడా బాలచంద్రుణ్ని, ఎంత గానో ప్రేమించింది. అయినా, రాజకీయ కారణాలవలన, ఒకరి నొకరు కలుసుకోవడానికి అవకాశమే లేకుండాపోయింది. వారిద్దరూ, ఒకరినొకరు స్మరిస్తూ, ఒకరికోసం మరొకరు పరవ టిల్లుతూ, అలానే నశించిపోయారు.]

'భద్రా! ఆ మూడు జన్మల్లోనూ వారు కలుకో లేదు. దేవేంద్రుని శాపఫలం వారి నట్లా కట్టి కుడిపింది. శాపం తీరింది. తిరిగీ మనం కలుసుకొన్నాం... నీకోసం, చాలా కాలంనుండీ నేను తిరుగుతున్నాను. ఈనాటికి, ఇక్కడ, మనం కలుసుకొన్నాం... ఎన్ని సంవత్సరాల ఎడబాటు తరు

వాత నైతేనేంగాక, నిన్ను పొందాను. నా కంతకన్నా కావలసిన దేమీ లేదు.' అన్నది మంజీర...

(భావనారాయణ ఓ సిగరెట్టు వెలిగించి, గట్టిగాపొగ పీల్చి, మెత్తుగా బైటికి వదులుతూ చెప్పసాగాడు.)

—మంజీర ఈ మాటలంటూ అతనిచేయి పట్టుకొని, నావనుండి లేచింది. ఇద్దరూ తీరానికి వచ్చారు. ఒకరిచేయిమరొకరు పట్టుకొన్నారు. మెత్తని పచ్చికమీదుగా,దూరంగా కనిపిస్తున్న మేడ కేసి వెళ్ళిపోయారు ... ఉన్నట్టుండి, ఒకసారి కాంతిపుంజాలు, ఆ ప్రదేశమంతటా విచ్చులుకొన్నాయి. చాలా సేపటికిగానీ, తిరిగి కోలుకోలేదు. సంభ్రమంతో, కళ్ళు నులుముకొని చూశాను. ఎదురుగా, గంభీరంగా ప్రవహిస్తున్న గోదావరి, ఏటి మధ్యగా పోతున్న పడవమీది గుడ్డిదీపపు మసకకాంతి, కొత్తప్రాణం పోస్తున్న చల్లనిగాలి, గంభీరమైన చెట్లనీడలు - మిగిలాయి.

ఆరోజు, ఆ తరువాత చాలాకాలమూ నేను ఆలోచించాను; ఇలాంటి భావసంచయం నాలో ఎందుకు కలిగిందా అని - కారణం కనిపించలేదు. నా కేమనిపిస్తున్నదంటే అలాంటి చారిత్రాత్మక ప్రదేశాల్లో, దాని తాలూకు పూర్వీకులు, లేదా వారి ఆత్మలు, స్వస్వరూపాలతో సాక్షాత్కరించడం ఇప్పటికీ జరుగుతుంటుందేమోనని !

సిగరెట్టు ఆఖరుసారి పీల్చి, దూరంగా గిరాటెట్టి, మా కేసిచూచి, ఓ చిరునవ్వు నవ్వాడు భావనారాయణ.